ముంపులోకే తీసుకువచ్చారు..



బుడమేరు వరద వచ్చిందని, ఇల్లు అన్నీ మునిగిపోతాయని చెప్పి తీసుకువచ్చారు. తీరా మేం వచ్చిన చోటు కూడా మునిగిపోయింది. నిన్న అధికారులు ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇప్పటి వరకు ఎలా ఉన్నామని అడిగిన వారే లేరు. మా ఇంటి వద్ద ఉంటే మా బతుకు ఏదో బతికే వాళ్లం.

– ఏ ఉమామహేశ్వరరావు, కేఎల్‌రావునగర్

మందులు కూడా లేవు..



పునరావాస కేంద్రం అని తీసుకువచ్చారు. కనీసం ఎలా ఉన్నారని అడిగే వారే లేరు. ఇక్కడ ఉన్న వారిలో ఎక్కువ మంది ముసలోళ్లమే. తిండి, మందులు లేవు. ప్రాణం పోతే మా కుటుంబాలు ఏం కావాలి.. ఈ వయస్సులో ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎటం.లక్ష్మి

కాలనీలో భయానక పరిస్థితి



జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో భయానక పరిస్థితి.. మా అమ్మ వాళ్లు ఉంటారు. రెండు రోజులుగా వారు ఎలా ఉన్నారో.. ఏం తింటున్నారో తెలియక ఆందోళన చెందుతున్నా. కరెంటు లేదు. ఫోన్లు అందుబాటులో లేవు. కాలనీలో ఓ పునరావాస కేంద్రం అయినా ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది.

– రేష్మా, వైఎస్సార్ కాలనీ

సహాయక శిబిరాలకు ప్రత్యేక అధికారుల కేటాయింపు

పటమట(విజయవాడతూర్పు): వరద ముంపు కారణంగా బాధితులను ఆదుకునేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా వీఎంసీ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసిందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాశక్తినగర్ కమ్యూనిటీ హాల్ సహాయక అధికారిగా ఎం.ఏసు 98859 81099, లగడపాటి రాజగోపాల్ కల్యాణ మండపానికి జయరాజు 90521 36895, కండ్రిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నగర్ కమ్యూనిటీ హాల్‌కు నాగార్జున 97012 53226 బాధితులకు అందుబాటులో ఉంటారన్నారు. వీరికి ఆయా కేంద్రాలకు ఆహార సరఫరాకు బి.గోవిందరావు 98486 64889 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు. వరద ప్రాంతాల్లో చెట్లు కొట్టుకువచ్చినా, విరిగిపోయినా వాటిని తొలగించేందుకు విక్టర్‌బాబు 99599 11593, సత్యనారాయణ 93900 40639, 97054 38282 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. బాధితుల సహాయార్థం వీఎంసీ హెల్ప్‌లైన్ నంబర్లు 0866 2424172, 2427485, వాట్సాప్ 81819 60909లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముంపు ప్రాంతాలకు ప్రత్యేక అధికారుల బృందం

విజయవాడను వరద ముంచెత్తటంతో సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రతి ప్రాంతానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు స్పెషల్ ఆఫీసర్లుగా విజయవాడ నగరపాలక సంస్థ అధికారి, స్పెషల్ ఆఫీసర్ రిలీఫ్ ఆపరేషన్స్‌గా ఐఏఎస్ అధికారి, వార్డు సెక్రటరీలతో ఈ బృందం పని చేస్తుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మీ సాయం అక్కర్లేదు.. వెళ్లిపోండి

సోమవారం రాత్రి వీఎంసీ సిబ్బందిపై మండిపడ్డ వించిపేటవాసులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'మాకు మీ సాయం అక్కర్లేదు... వెళ్లిపోండి. నిన్నటి నుంచి అల్లాడిపోతుంటే గుర్తుకు రాలేదా....?' అంటూ వించిపేట వాసులు నగరపాలకసంస్థ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వించిపేటను శనివారం రాత్రి నుంచి వరదనీరు ముంచెత్తింది. ఆదివారం కూడా వీఎంసీ సిబ్బంది ఎవరూ ఇటు చూడలేదు. స్థానికులు, సేవా సంస్థల సాయంతో కొంతమేర ఆహారం పంపిణీ జరిగిందని వీఎంసీ నుంచి ఎవరూ రాలేదని వారంతా మండిపడ్డారు. అయితే సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఫుడ్‌ప్యాకెట్లను తీసుకొని వీఎంసీ సిబ్బంది వాహనంలో పంజా సెంటర్‌కు చేరుకున్నారు. దానిని గమనించిన స్థానికులు వాహనానికి అడ్డుపడి పైవిధంగా స్పందించారు.. స్థానిక పెద్దలు వారిని సముదాయించి వాహనాన్ని ముందుకు పంపారు.

సాయం కోసం ఎదురుచూపులు

- ఒక్క పశ్చిమంలోనే లక్షన్నరకు పైగా బాధితులు
- దారుణంగా మారిన చిన్నారులు, వృద్ధుల పరిస్థితి
- విద్యుత్ సరఫరా లేక అవస్థలు
- మూడు రోజులుగా అల్లాడుతున్నా పట్టించుకోవటం లేదంటూ ప్రజల ఆవేదన



ప్రకాశం బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



సితార సెంటర్ వద్ద పడవలో వస్తున్న వరద బాధితులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బుడమేరు ఉగ్ర రూపానికి అల్లాడుతున్న పశ్చిమ నియోజకవర్గ ప్రజానీకం సాయం కోసం ఎదురు చూస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బుడమేరు వరద నీరు విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. ఆ క్రమంలో తొలుత పశ్చిమ నియోజకవర్గంలోని మూడు వంతుల డివిజన్లను చుట్టుముట్టింది. మూడు రోజులుగా నానా ఇబ్బందులు పడుతున్న నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవటంతో మండిపడుతున్నారు. కిందకు దిగుదామంటే మనిషి ఎత్తున చుట్టూ నీరు, ఇంట్లో ఉందామంటే విద్యుత్ సరఫరా లేక ఏమి పాలుపోని పరిస్థితులు ఏర్పడ్డాయి.

మూడు రోజులుగా నరకం..

మూడు రోజులుగా వరద పరిస్థితులతో ప్రత్యక్ష నరకం చూస్తున్నామని స్థానిక ప్రజానీకం వాపోతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురం, విద్యాధరపురం, ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్, కబేళా, పాలప్రాజెక్ట్, కేఎల్‌రావునగర్, లంబాడీపేట, పాతరాజరాజేశ్వరిపేట, కంసాలిపేట నైజాం గేట సెంటర్, వించిపేటలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం ఉదయం వరకూ వరద నీరు ప్రవహించింది. ఆదివారం రాత్రికి వించిపేట మొత్తం వరద నీరు ఆక్రమించటంతో పాటు మహంతీపురం, కొత్తపేట వైపు సైతం వరద చొచ్చుకువచ్చింది. అలాగే గట్టువెనుక కుమ్మరిపాలెం, స్వాతి సెంటర్ వైపు సైతం వరద నీరు భారీగా చేరుకుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అనారోగ్య సమస్యలతో సతమతం..

పశ్చిమ నియోజకవర్గంలోని సగానికిపైగా ప్రజానీకం వరద ప్రభావానికి గురయ్యారు. ఆయా డివిజన్లలోని సుమారు లక్షన్నరకు పైగా వరద బారిన పడ్డారు. వారందరికీ సరైన సాయం అందక అల్లాడుతున్నారు. గతంలో ఎన్నడూ చూడని వరద విపత్తుతో ఏమి చేయాలోపాలుపోక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్న వారు ఇళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వించిపేటలో మరింత దయనీయం

నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో గతంలో వరదనీరు వచ్చి వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అయితే వించిపేటకు బుడమేరు వరద నీరు ముంచెత్తిన దాఖలాలు లేవు. దాంతో ఊహించని విధంగా వరద నీరు తమ ఇళ్లను చుట్టుముట్టడంతో స్థానిక ప్రజానీకం అనేక అవస్థలు పడుతున్నారు. ముందస్తు సమాచారం లేకపోవటంతో తాము ఎటువంటి ఆహారాన్ని భద్రపరచుకోలేదని, రెండు రోజులుగా పూర్తిగా నీరు ముంచెత్తడంతో చిన్నపిల్లలతో ఏమి చేయాలో పాలుపోవటం లేదంటూ వించిపేట వాసులు ఆవేదన వెళ్లగక్కుతున్నారు.

పత్తాలేని అధికారులు

నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున విపత్తు సంభవించినా నగరపాలకసంస్థ, రెవెన్యూ అధికారులు పత్తా లేరని స్థానిక ప్రజానీకం వాపోతున్నారు. ప్రధానంగా మూడు రోజులుగా నీటిలో నానుతుంటే మాకు ధైర్యం చెప్పే అధికారులు ఇటువైపు రాలేదని వారు మండిపడుతున్నారు. అయితే నియోజకవర్గంలోని సహాయక కార్యక్రమాల కోసం ఇద్దరు ముగ్గురు అధికారులను కేటాయించినా ఇంత పెద్ద సంఖ్యలో జనం ఇబ్బందులకు వారు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. అధికారులందరూ సింగ్‌నగర్ వైపు చూస్తున్నారంటూ మమ్మల్ని వదిలేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు, ఆహారం అందక ఇబ్బందులు

వించిపేట(విజయవాడపశ్చిమ): వరద ముంపునకు గురైన పాత ఆర్ఆర్‌పేట వాసులు పునరావాసం, తాగునీరు, ఆహారం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ ఇళ్లు, గ్రౌండ్ ఫ్లోర్లు పూర్తిగా నీట మునగటంతో ఇంటి పైకప్పులు, అందుబాటులో ఉన్న బిల్డింగ్‌లపైకి ఎక్కి ప్రాణాలను కాపాడుకుంటున్నారు. అధికారులు కొన్ని బోట్లను ఏర్పాటు చేసి ఆహారం, తాగు నీరు అందించి ఎర్ర కట్ట రహదారిపైకి తరలించడంతో రోడ్డుపైనే పడిగాపులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాలకు రెస్క్యూ టీమ్ వెళ్లకపోవడంతో అక్కడి వారు ఆహారం, తాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఆ ఇంట్లోని వృద్ధులు, మహిళలను విడిచి యువకులు వరద నీటిలో ఈదుకుంటూ బయటకు వచ్చి తమ వారిని రక్షించాలంటూ అక్కడ సిబ్బందిని వేడుకుంటున్నారు. ముంపు గురించి అధికారులు ముందస్తు సమాచారం అందించకపోవడంతోనే వరదలో చిక్కుకుపోయినట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక యువకులు స్వచ్ఛందంగా ట్యూబ్‌ల ద్వారా ప్రజలను సురక్షితంగా బయటకు తరలిస్తున్నారు.

బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ నేతలు..

వైఎస్సార్ సీపీ నియోజవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ పాత ఆర్ఆర్‌పేటలో ట్రాక్టర్‌లో తిరుగుతూ బాధితులకు ధైర్యం చెప్పారు. వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులందరికీ ఆహారం, తాగునీరు అందించాలని, ఇళ్లు మునిగి కట్టు బట్టలతో బయటపడిన బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ పాత ఆర్ఆర్‌పేటలో పర్యటించి, బాధితులను పరామర్శించారు. వారికి అవసరమైన ఆహార పొట్లాలు, తాగునీరును అందజేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారిని రక్షించేందుకు డబ్బులు వసూలు చేయడం దురదృష్టకరమన్నారు. తాగటానికి నీరు ఇవ్వండి అంటూ బాధితులు అడుగుతుంటే ప్రభుత్వం, అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు.

ఒక్కో వ్యక్తి నుంచి రూ.500 వసూలు..

వరద ముంపులో చిక్కుకున్న బాధితులను రక్షించేందుకు ప్రభుత్వం సరిపడా పడవలు ఏర్పాటు చేయలేదు. ఇదే ఆసరాగా కొంత మంది పడవలను తీసుకువచ్చి బాధితుల నుంచి రక్షించేందుకు ఒక్కో వ్యక్తికి రూ. 500 వసూలు చేస్తున్నారు. ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని స్థానికులు వాపోతున్నారు.



ట్యూబుల ద్వారా ప్రజలను తరలిస్తున్న స్థానిక యువకులు

మమ్మల్ని పట్టించుకోండి..

కనీసం మంచినీరు సైతం అందించే పరిస్థితి లేకుండా పోయిందని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. విద్యుత్ సరఫరా నిలిపివేసిన కారణంగా మోటర్ల ద్వారా మంచి నీరు వచ్చే పరిస్థితి లేదు. బయట నుంచి అందిస్తేనే వారికి తాగటానికి నీరు లభిస్తుంది. అయితే తాగటానికి గుక్కెడు మంచినీరు కానీ, తినటానికి ఆహారం కాని ఇచ్చిన దిక్కు లేదంటూ ప్రజానీకం మండిపడుతున్నారు. చిన్నారులు, వృద్ధులతో తాము చాలా బాధ పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతసేపటికీ సింగ్‌నగర్ వైపే చూస్తున్నారు తప్పా మా వైపు చూసే ఎమ్మెల్యే కానీ, అధికారులు కానీ కనపడకుండా పోయారంటూ మండిపడుతున్నారు.



చెరువును తలపిస్తున్న సితార - కబేళారోడ్డు



మహ్మదాలీపురం స్కూల్ వద్ద పరిస్థితి





ట్రాక్టర్‌పై ప్రజలను బయటకు తరలిస్తున్న ఆసిఫ్ : ట్రాక్టర్‌లో బాధితులను తరలిస్తున్న దృశ్యం

సహాయ కార్యక్రమాల్లో ఆసిఫ్ బృందం

బుడమేరు ఉధృతితో అల్లాడుతున్న వించిపేట తదితర ప్రాంతాల్లోని ప్రజలకు వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ బృందం అండగా నిలిచింది. వారికి భరోసా కల్పించే విధంగా సహాయక కార్యక్రమాలను చేపట్టింది. ఆసిఫ్ ప్రత్యేకంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ప్రజలను, వృద్ధులను, చిన్నారులను బయటకు తీసుకొచ్చారు. అలాగే పలు ప్రాంతాల్లో ఆకలితో అలమటిస్తున్న వారికి ఆహారాన్ని అందించారు. అంతేకాకుండా ఇతర వాహనాలను ఏర్పాటు చేసి వారి గమ్యస్థానాలకు పంపించారు. ఉదయం నుంచి ఆసిఫ్, ఆయన బృందం సహాయక కార్యక్రమాలను నిర్వహించింది.



వించిపేటలో సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబం



సితార సెంటర్‌లో సాయం కోసం వేచి ఉన్న ప్రజలు



వించిపేట గాంధీబొమ్మ సెంటర్‌లో వరద ఉధృతి



కుమ్మరిపాలెం సెంటర్‌లో హైవేపై నిలిచిన నీరు

విజయ డెయిరీ ఆధ్వర్యంలో పాలు, బటర్ మిల్క్ పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ది కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) వరద ముంపు బాధితులకు తమ వంతుగా సాయం అందించారు. నగరంలోని పలు ముంపు ప్రాంతాల్లో విజయ పాలు, బటర్ మిల్క్‌ను ఉచితంగా అందజేసినట్లు చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. సింగ్ నగర్, కేఎల్‌రావునగర్‌తో పాటు గొల్లపూడి పరిసర ప్రాంతాల్లో 35 వేల లీటర్ల పాలు, 40 వేల లీటర్ల బటర్ మిల్క్‌ను అందజేశామన్నారు. సోమవారం విజయ అవుట్‌లెట్స్‌లో వినియోగదారులందరికీ పాలు అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పాల సేకరణ, వినియోగదారుడికి పాలు అందించడానికి విజయ యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పాల ప్రాజెక్టును ఎమ్మెల్యే సుజనా చౌదరి సోమవారం సందర్శించారు. వరద ప్రభావంతో ఫ్యాక్టరీ లోపల దెబ్బతిన్న పాల పదార్థాలు, మిషనరీతో పాటు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ గురించి చైర్మన్ చలసాని ఆంజనేయులు ఎమ్మెల్యేకు వివరించారు.



ఫ్యాక్టరీలో సిబ్బందికి సూచనలిస్తున్న చైర్మన్ ఆంజనేయులు

ప్రమాదకరంగా రైల్వే ట్రాక్‌లపై వరద నీరు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తిన వరదల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు సెక్షన్‌లలో ట్రాక్‌లపై ప్రమాదకర స్థాయిలో వరద ప్రవాహం రావటంతో అధికారులు గత రెండు రోజులుగా పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు కొన్నింటిని దారి మళ్లించి నడుపుతున్నారు. కృష్ణానదిలో పోటెత్తిన వరదల కారణంగా ప్రకాశం బ్యారేజీ నుంచి గేట్లను తెరచి భారీగా కిందికి నీటిని విడుదల చేయడంతో సోమవారం ప్రమాదకర స్థాయిలో వరద నీరు రైల్వే బ్రిడ్జిని తాకింది. దీంతో అప్రమత్తమైన విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అధికారులతో కలిసి స్వయంగా కృష్ణా నదిపై రైల్వే బ్రిడ్జిని సందర్శించి వరద తీవ్రతను అంచనా వేశారు. దీనిపై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి వరద నివారణ చర్యలు, దెబ్బతిన్న ట్రాక్‌ల పునరుద్ధరణ, డివిజన్‌లోని అన్ని రైల్వే బ్రిడ్జిల వద్ద పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. డివిజన్‌లో వరద ముంపునకు గురైన డిపోలు, శాటిలైట్ స్టేషన్‌ల పరిస్థితిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వేకి జరిగిన నష్టాన్ని అంచనా వేయడం, యుద్ధ ప్రాతిపాదికన రైళ్ల కార్యకలాపాల పునరుద్ధరించడం, వరద నివారణ చర్యలు చేపట్టడంపై దృష్టి సారించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో ప్రధాన వంతెనల వద్ద ఎప్పటికప్పుడు నీటి స్థాయిలను పర్యవేక్షించడం, ట్రాక్‌లపైకి భారీగా ప్రవహిస్తున్న వరద స్థాయిని అంచనా వేసేందుకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు.

అధికారులతో డీఆర్ఎం అత్యవసర సమావేశం

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు నిల్



పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావానికి ముంపునకు గురైన వారికి వీఎంసీ కల్పిస్తున్న పునరావాస కేంద్రాలు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇక్కడ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది అడ్రస్ లేకపోవటంతో నిర్వాసితులు వారి సమస్యలను చెప్పుకోలేని స్థితి నెలకొంది. ఆహారాన్ని కూడా సక్రమంగా అందించలేకపోవటంతో దాతలను బతిమలాడుకుని కడుపునింపుకోవాల్సిన దుస్థితి నెలకొందని పునరావాసంలో ఉంటున్న నిర్వాసితులు పేర్కొంటున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ నగరంలోని 12 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు కల్పిస్తే అందులో పట్టుమని 300 మంది కూడా ఉండటానికి ఇష్టపడటం లేదు. సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయం వెంబడి ఉన్న ప్రశాంతి నగరపాలక సంస్థ ప్రత్యేక పాఠశాలలో సౌకర్యాలను సోమవారం రాత్రి 'సాక్షి' పరిశీలించగా అందులో నిర్వాసులంతా తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఇళ్లలో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు రావాలని ఒత్తిడి చేసి ఇక్కడికి తీసుకువచ్చారు. అయితే ఇక్కడ అరాకొర సౌకర్యాలు ఉండటం, సమయానికి భోజనాన్ని అందించకపోవటం, బాలింతలు, గర్భిణులు, వృద్ధులున్నప్పటికీ వారికి సరైన సౌకర్యాలు కల్పించలేకపోవటంతో చాలా మంది బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. నగర వ్యాప్తంగా ఉన్న ఆయా కేంద్రాల్లో ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసినప్పటికీ వారందరు కేంద్రాల్లో అందుబాటులో ఉండటంలేదని నిర్వాసితులు వాపోతున్నారు.

మాగోడు వినిపించుకోవటంలేదు



అధికారులు పునరావాస కేంద్రానికి తీసుకువచ్చారు. ఇక్కడ భోజనం కూడా పెట్టడంలేదు. ఇక్కడికి వచ్చి రెండురోజులవుతుంది. మమ్మల్ని పట్టించుకునేవారు లేరు. ఉదయం, సాయంత్రం అధికారులు నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారే తప్పా మా గోడు వినిపించుకోవటంలేదు. చాలామందికి జ్వరాలు వస్తున్నాయి.

– శంకర్, వరద బాధితుడు

నీటిని కొనుకుంటున్నాం..



దాతల నుంచి వచ్చిన భోజనాన్ని సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రోజులో ఒక్కసారి మాత్రమే వీఎంసీ భోజనాలను అందిస్తుంది. ఆ ఆహారం సరిపోవటం లేదు. తెలిసిన వారిని బతిమలాడుకుంటే భోజనాలను పంపిస్తున్నారు. తాగునీరు సదుపాయం కూడా లేదు. బయట నుంచి నీటిని కొనుకుంటున్నాం.

– చిన్నూ, వరద బాధితురాలు